# దూది రైతుల దిగులు

- మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో దెబ్బ తిన్న పంట
- పత్తి రంగు మారడంతో కలవరపడుతున్న రైతులు
- నల్ల మచ్చలతో రాలిపోతున్న పత్తి కాయలు
- పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- ప్రభుత్వం ఆదుకోవాలని పత్తి రైతుల వినతి



చేలల్లో నల్లబడిపోతున్న పత్తి పంట



అధిక వర్షాలకు రాలిపోయిన పత్తిని సేకరిస్తున్న రైతు

అశ్వారావుపేట, డిసెంబర్ 18 : మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంట నల్లబడింది. చెట్లపై ఏరకుండా ఉన్న పత్తి పంట రంగు మారడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఉన్న పత్తి కాయలకు నల్ల మచ్చలు ఏర్పడి చేనులోనే రాలిపోతున్నాయి. దీంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చే సమయంలోనే తుపాను పత్తి పంట నాణ్యతను దెబ్బతీసిందని మదనపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా గత ఏడాది 1,62,100 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఈ ఏడాది 2,02,142 ఎకరాలకు పెరిగింది. మిగ్‌జాం తుఫాన్ వల్ల జిలావ్యాప్తంగా కురిసిన అధిక వర్షాలకు వాణిజ్య పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఇందులో పత్తి పంటకు అధిక నష్టం వాటిల్లింది. పంట నల్లబడిపోవడంతోపాటు కాయలు, ఆకులు నేలరాలిపోయాయి. వరద నీటి నిల్వతో పంట పూర్తిగా తడిసిపోయింది. పంట నాణ్యత కోల్పోవడంతో గిట్టుబాటు ధర లభించడం ప్రశ్నార్థకంగా మారింది. పంట వేసినప్పటి నుంచి రైతులు పడ్డ ఆరుగాలం కష్టం తుఫాన్‌కు ఆవిరైపోయింది. జిల్లాలో ఈ ఏడాది 2,02,142 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. గత ఏడాది 1,62,100 ఎకరాల్లో సాగైంది. అంటే.. ఈ ఏడాది అధికంగా 40,042 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. మొత్తం సాగు ప్రణాళిక సుమారు 5.05 లక్షలు ఎకరాలు కాగా.. అందులో ప్రధానంగా పత్తి పంట 2,02,142 ఎకరాల్లో సాగవుతున్నది. పత్తికి రెండేళ్లుగా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం.. గిట్టుబాటు ధర లభించడంతో పత్తి సాగు పట్ల రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది కురిసిన వర్షాలు ఆరుతడి పంటలకు అనుకూలంగా ఉండగా.. పత్తి పంటకు జీవం పోశాయి. దీంతో పత్తి పంట ఏపుగా పెరిగింది. అదే స్థాయిలో దిగుబడి ఉంటుందని రైతులు, అధికారులు అంచనా వేశారు. పంట చేతికొస్తున్న సమయంలో మిగ్‌జాం ప్రభావంతో కురిసిన అధిక వర్షాలు పత్తి సాగును ధ్వంసం చేశాయి. వర్షపు నీటితో తోటల్లో పత్తి కాయలు నల్లబడి రాలిపోయాయి. ఆకులపై మచ్చలు వచ్చి వివిధ రకాల తెగుళ్లు సోకాయి. తెగుళ్లతో పత్తి చెట్లు కూడా మాడిపోయాయి. కాగా.. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం.. సరైన సూర్యరశ్మి అందక పంట తెగుళ్ల బారిన పడుతుందని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు. పత్తి సాగవుతున్న భూములు ఎక్కువ ఎత్తు పల్లాల్లో ఉండడంతో వరద నీరు నిల్వ ఉండి లోతట్టు ప్రాంతాల్లో చేలు ఆరడం లేదు. దీంతో చేలల్లో కలుపు కూడా బాగా పెరుగుతోంది. మంచు ప్రభావం సైతం ఎక్కువగానే ఉండడంతో తెగుళ్ల విజృంభించే ప్రమాదం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## మరింత తగ్గే అవకాశం..

వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మరో 40,042 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ లెక్కన దిగుబడి అంచనా 12.13 లక్షల క్వింటాళ్ల దిగుబడి ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు. కానీ.. తుఫాన్ ప్రభావంతో దిగుబడులు తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తుఫాన్ వల్ల కురిసిన అధిక వర్షాలకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఫలితంగా తెగుళ్ల బెడద నుంచి కొంత మేరకు పంటను కాపాడుకోవచ్చు. కాయలు చెట్టు నుంచి రాలిపోవడాన్ని నివారించవచ్చు. సూచనలు, సలహాల కోసం అందుబాటులో ఉన్న ఏఈవోలను రైతులు సంప్రదించాలి. పంట నష్టం అంచనాలను సేకరిస్తున్నాం. నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తాం.

– వై.నవీన్, మండల వ్యవసాయాధికారి

### ప్రభుత్వం ఆదుకోవాలి



అధిక వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకొని చేయూతనివ్వాలి. సకాలంలో పరిహారం మంజూరు చేసి రైతుకు సర్కార్ తోడ్పాటునివ్వాలి. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– కుర్రేళ్ల ఏలేసు, రైతు, అశ్వారావుపేట

### పరిహారం చెల్లించాలి



తుఫాన్ ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. వారికి తక్షణమే ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి. దేశానికి వెన్నెముకగా చెప్పుకునే రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

– మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే


# మల్చింగ్ మస్త్

- ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుండడంతో అన్నదాతల ఆసక్తి
- ఈ విధానం సాగుతో భూమికి, పంటకు బహుళ ప్రయోజనాలు
- వార్షిక, ద్వైవార్షిక, బహువార్షిక పంటలకు అన్ని విధాలా మేలు
- ఆసక్తి కలిగిన రైతులకు అధికారుల ప్రోత్సాహకాలు, రాయితీలు



ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 18 : తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే మల్చింగ్ విధానంపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. ఈ విధానంపై సాగయ్యే భూమి విస్తీర్ణం కూడా క్రమంగా పెరుగుతోంది. వార్షిక, ద్వైవార్షిక, బహువార్షిక పంటల సాగులో పాలీ ఫిల్మ్‌ను భూమిపై కప్పే విధానాన్నే మల్చింగ్ అంటారు. కూరగాయలు, పండ్లు, మిర్చి తదితర పంటల సాగులో కొన్నేళ్లుగా జిల్లా రైతులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. తద్వారా అనేక ప్రయోజనాలూ పొందుతున్నారు. ఈ పద్ధతిలో పంటను బట్టి పాలీ ఫిల్మ్‌ను వాడాల్సి ఉంటుంది. రెండు రకాల పాలీ ఫిల్మ్‌లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఒకటి పైన సిల్వర్ కలర్ ఉండి లోపలి భాగం నలుపు రంగులో ఉంటుంది. రెండోది పైభాగం, లోపలి భాగం రెండూ నలుపు రంగులోనే ఉంటాయి. వార్షిక పంటలైన కూరగాయలు, మిర్చి తోటలకు 20–25 మైక్రాన్ల మందం కలిగిన రకం, ద్వైవార్షిక పంటలు (వంగ, దొండ)కు 40–45 మైక్రాన్ల మందం కలిగిన రకం, బహువార్షిక పంటలైన పండ్ల తోటలకు 50–100 మైక్రాన్ల మందం కలిగిన పాలీ ఫిల్మ్‌లు మాత్రమే వాడాల్సి ఉంటుంది.

## మల్చింగ్‌తో ఉపయోగాలు ఇలా..



మల్చింగ్ విధానంతో సాగవుతున్న పంటలు

మల్చింగ్ సాగు వల్ల భూమిలో నిత్యం తేమ శాతం సంరక్షించుకునే అవకాశం ఉంది. భూమి నుంచి నీరు ఆవిరి కాకుండా మొక్క నిల్వ ఉంచుకునే అవకాశం ఉంది. ఈ విధానం నేలలో ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించి మొక్కకు తగిన సూక్ష్మ వాతావరణాన్ని కల్పిస్తుంది. ఈ సూక్ష్మ వాతావరణం వల్ల దిగుబడులు మరింత పెరిగే అవకాశం కలుగుతుంది. పంటలో కలుపు నివారించుకునే అవకాశమూ ఉంది. భూమిలో చీడపీడలకు కారణమైన బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, ఇతర బ్యాక్టీరియాలు పూర్తిగా నశించే అవకాశం ఉంది. పైభాగం సిల్వర్ కలర్ ఉండే పాలీ ఫిల్మ్ వాడడం వల్ల క్రిమి కీటకాలు దరిచేరవు. పంట పూర్తయ్యేలోపు (డ్రిప్ ద్వారా) వేసిన ఎరువులు పూర్తిస్థాయిలో మొక్కలకు అందుబాటులో ఉండి దిగుబడులు పెంచుకునేందుకు దోహదం కలుగుతుంది. భూమి గుల్లబారి సమయానుకూలంగా మొక్కలకు కావాల్సిన నీరు, లవణాలు, పోషకాలను అందుబాటులో ఉంచుతుంది. ఈ విధానం ద్వారా సాగు ఖర్చు కూడా 40 శాతం వరకు తగ్గుతుంది.

### 275 ఎకరాల్లో వినియోగం..

జిల్లావ్యాప్తంగా ఉద్యాన రైతులు 275 ఎకరాల్లో మల్చింగ్ పద్ధతిలో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని, కొణిజర్ల, సింగరేణి, కామేపల్లి, సత్తుపల్లి, వేంసూరు, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండలాల్లో పలువురు రైతులు మల్చింగ్ విధానం అవలంబిస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారులు కూడా ఆసక్తి కలిగిన రైతులకు తగిన ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఒక హెక్టార్‌కు రూ.16 వేల రాయితీ అందిస్తున్నారు. రైతులు తాము కొనుగోలు చేసుకొని దరఖాస్తుతోపాటు డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతా నెంబర్‌ను ఉద్యాన శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చు. క్షేత్రస్థాయి తనిఖీ అనంతరం గరిష్ఠంగా ఒక రైతుకు 2 హెక్టార్ల వరకూ నిర్దేశించి తగిన రాయితీని సదరు రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

- అధికారులు తమ శాఖల కచ్చితమైన సమాచారం అందించాలి
- ప్రతి నెలా 5వ తేదీలోగా వేతనాలు ఇచ్చేలా చర్యలు చేపడతాం
- అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి
- అధికారుల సమీక్షలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, డిసెంబర్ 18: ఎన్నికల మ్యానిఫెస్టోలో తాము చెప్పిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అధికారులందరూ తమ శాఖలకు సంబంధించిన కచ్చితమైన లెక్కలను, సమాచారాన్ని అందించాలని సూచించారు. పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై నూతన కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయదని అన్నారు. ప్రతి అంశంలో శ్వేతపత్రం విడుదల చేస్తామని అన్నారు. అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి కచ్చితమైన లెక్కలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, వైద్యం, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల పనులపై సమీక్షిస్తున్నామని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఎంత మంది ప్రజలకు, ఎన్ని గృహాలకు తాగునీటి సరఫరా చేస్తున్నారో నివేదిక సమర్పించాలని సూచించారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు స్థల కేటాయింపు, ఫ్యాకల్టీ గురించి నివేదించాలని, పూర్తి స్థాయిలో కళాశాల నడిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేషనల్ హైవేస్ ప్రాజెక్టులు, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సీతారామ ప్రాజెక్టు కింద రెండు ప్యాకేజీల పనుల్లో అవసరం లేని చోట భూ సేకరణలు చేసిన దగ్గర అవసరాలకు పనికొచ్చే భూములను చుట్టుపక్కల గ్రామాల నిరుపేదలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్నేరు వాగు నుంచి లిఫ్ట్ లేకుండా గ్రావిటీతో సీతారామ ప్రాజెక్టుకు నీరు వెళ్తుందేమో గమనించి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పాలేరు లింక్ కెనాల్‌కు భూసేకరణ కోసం రైతులతో తాను మాట్లాడుతానని అన్నారు. ఇప్పటికే కేటాయించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ఏ ప్రాతిపదికన కేటాయించారో నివేదిక సమర్పించాలన్నారు. తహసీల్దార్లు ఇప్పటికే జారీ చేసిన పొజీషన్ సర్టిఫికెట్లు, పాస్‌బుక్‌లు పునఃపరిశీలించాలని, తప్పులు జరిగితే సరిదిద్దాలని సూచించారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని, వాటి రక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రులున్నాయో, ఎంత మంది సిబ్బంది ఉన్నారో, ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో అనే అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వైద్యం విషయంలో పాలేరును ఆదర్శంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూడాలన్నారు. ఆర్థిక వ్యవస్థను అతికొద్ది రోజుల్లోనే గాడిలోకి తెస్తామని, 1 నుంచి 5 తేదీల్లోగా వేతనాలు ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్, కసీపీ విష్ణు ఎస్ వారియర్, సత్యప్రసాద్, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం

గ్రీవెన్స్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, డిసెంబర్ 18: అర్జీదారుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యమివ్వాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం తదుపరి చర్య, పరిష్కారం కోసం వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాదివస్‌లో వినతుల స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కారానికే తమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీపీ విష్ణు ఎస్ వారియర్ అన్నారు. ఖమ్మంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్‌లో బాధితుల నుంచి ఆయన వినతులు స్వీకరించి మాట్లాడారు. అనంతరం ఆయా ఫిర్యాదులను పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోలను ఆదేశించారు.



పరుశురాముడిగా దర్శనమిస్తున్న భద్రాద్రి రామయ్య

# పరశురాముడిగా..

- ఆరో రోజు పూజలందుకున్న భద్రాద్రి రామయ్య
- అంగరంగ వైభవంగా అధ్యయనోత్సవాలు
- గోదావరి తీరాన భక్తిశ్రద్ధలతో హారతులు
- స్వామివారిని తలచుకుంటూ పరవశించిన భక్తజనం



రామయ్యకు తిరువీధిసేవ నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 18 : భద్రాద్రి దివ్యక్షేత్రంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిరోజు రామయ్యకు దశావతారాల్లోని అవతారాలను ధరింపజేసి.. ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆరో రోజు స్వామివారిని పరశురాముడిగా అలంకరించారు. సోమవారం సందర్భంగా అంతరాలయంలోని మూలవరులకు బెంగళూరు భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను ధరింపజేశారు. ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులు(స్వర్ణ మూర్తులు), నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో అభిషేక తిరుమంజనం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని అంతరాలయంలోనికి తీసుకెళ్లి పరశురామునిగా అలంకరించి బేడా మండపంలో వేంచేపు చేశారు. పరశురామునిగా ఉన్న రామయ్యను భక్తులు దర్శించుకొని తరించారు. ఆ తర్వాత అంతరాలయంలోనికి తీసుకెళ్లి రాజభోగం సమర్పించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారిని సమస్త మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలు, కోలాట నృత్యాల నడుమ గోదావరి నది తీరానికి తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో హారతులు సమర్పించారు. తిరిగి మిథిలా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారిని ఆశీనులను చేసి హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు చేపట్టారు. పరశురాముడిగా దర్శనమిస్తున్న స్వామివారిని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం తిరువీధి సేవను తాతగుడి సెంటర్ వరకు జరిపారు. పరశురాముడిగా దర్శనమిస్తున్న స్వామివారిని కనులారా దర్శించుకునేందుకు భక్తులు రహదారుల కిరువైపులా నిలిచి మదినిండా తలచుకుంటూ పరవశించిపోయారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి, ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఈఈ రవీందర్, ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏర్పాట్ల పరిశీలన



పరశురాముని అవతారంలో స్వామివారు

పర్ణశాల, డిసెంబర్ 18 : భద్రాచలం పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల క్షేత్రంలో జరిగే ముక్కోటి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం పరిశీలించారు. తొలుత ఆయన ఉత్తర ద్వార దర్శనం జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. వైకుంఠ దర్శనం విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ఇన్‌స్పెక్టర్‌కు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో సీఐ దోమల రమేశ్, పర్ణశాల ఆలయ ప్రత్యేకాధికారులు, ఏఈవో శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### పర్ణశాలలో...

పర్ణశాల, డిసెంబర్ 18 : ముక్కోటి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల ఆలయంలో రామయ్య సోమవారం పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఈ రూపంపై భక్తులకు వివరించారు. శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాలున్న రాముడిని దర్శించడం వల్ల శుభ ఫలితాలు పొందుతారని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు అర్చకులు తిరువీధి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు శేష కిరణ్ కుమార్ చార్యులు, భరద్వాజ్ చార్యులు, అమరవాది శ్రీకాంత్ చార్యులు, నరసింహాచార్యులు, రాజగోపాలాచార్యులు, ఏఈవో శ్రవణ్‌కుమార్, అనిల్, కిశోర్, గుమస్తా ప్రసాద్, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

### ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఈవో రమాదేవి

భద్రాచలం, డిసెంబర్ 18 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 22న అత్యంత వైభవోపేతంగా నిర్వహించే తెప్పోత్సవం, 23న నేత్రపర్వంగా జరిపే ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లను ఏఎస్పీ పరితోష్ పంకజ్.. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవితో కలిసి పరిశీలించారు. సెక్టార్ల ఏర్పాట్ల గురించి ఈఈ రవీందర్‌రాజును అడిగి తెలుసుకున్నారు. అలాగే వీవీఐపీ సెక్టార్‌లో భద్రత, సీసీ కెమెరాల ఏర్పాట్ల గురించి చర్చించారు. కాగా.. ఉత్తర ద్వార దర్శనానికి నూతన మంత్రులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు సమాచారం.